అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

వెంకటరావు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని పెద్దబిడ్డ స్కూల్ కాంప్లెక్స్ పరిధి గుమ్మ మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు కిల్లో వెంకటరావు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కొన్నాళ్ళుగా అస్వస్థతతో బాధపడుతున్న వెంకటరావుకు కుటుంబసభ్యులు వైద్యసేవలు అందించినప్పటికి, ఆరోగ్యం మెరుగుపడక మృత్యువాత పడ్డారని తెలిపారు. ఉపాధ్యాయుని అకాల మరణంతో ఆయన స్వగ్రామం టోకూరు పంచాయతీ ములియగుడలో విషాదఛాయలు అలుముకున్నాయి. వెంకటరావు మృతిపై ఎంఇఒ ఎల్‌బి.వెంకటరావు, యుటిఎఫ్ నేతలు పి.దేవుడు, ఎస్.రాంబాబు, ఈశ్వరరావు, తోటి ఉపాధ్యాయులు సన్యాసిరావు, జానకిరామ్, ఇతర ఉపాధ్యాయులతో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సంతాపం ప్రకటించారు. వెంకటరావు కుటుంబానికి సానుభూతి తెలిపారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- కనీస వేతనాలు ఇవ్వకపోవడం దారుణం
- సిఐటియు అల్లూరి జిల్లా మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బేబీరాణి

అల్లూరి జిల్లా సిఐటియు ప్రథమ మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బేబీరాణి

ప్రజాశక్తి పాడేరు: దేశంలోనూ. రాష్ట్రంలోనూ ప్రభుత్వరంగ సంస్థల్లో స్కీంవర్కర్లుగా పనిచేస్తున్న మహిళా కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలను చెల్లించడం లేదని, మహిళలను ఉద్ధరిస్తున్నామని గొప్పలు చెప్పుకునే పాలకులకు ఇది సిగ్గుచేటని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు బేబీ రాణి మండిపడ్డారు. మంగళవారం అల్లూరి జిల్లా సిఐటియు ప్రథమ మహాసభలో భాగంగా మోదకొండమ్మ ఆడిటోరియంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ అధ్యక్షతన నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందని, స్టీల్‌ప్లాంట్‌తో సహా లాభాల్లో ఉన్న పలు ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రజల సంపదను అంబానీ, ఆదానీలకు కట్టబెడుతోందన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రంలోని స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత లేదని, అసంఘటిత రంగ కార్మికులు కనీస వేతనాల్లేక అల్లాడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక హక్కుల సాధనకు ఐక్యపోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మార్చిలో చలో అసెంబ్లీ నిర్వహించి,కార్మిక సమస్యలను జగన్మోహనరెడ్డి ప్రభుత్వం పరిష్కరిస్తుందో, లేదో తేల్చుకోవాలన్నారు, మోడీ ప్రభుత్వాన్ని మెడలు వంచిన ఢిల్లీ రైతాంగ పోరాటం స్ఫూర్తిగా కార్మికులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరిస్తూ, సంఘం పెట్టుకునే స్వేచ్ఛ, వాక్ స్వతంత్రాన్ని కూడాకాలరాస్తోందన్నారు. లౌకికతత్వానికి భిన్నంగా కులాలు, ప్రాంతాల, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటోందని మండిపడ్డారు. ఐదో షెడ్యూల్ నిబంధనలను తుంగలో తొక్కి గిరిజన ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరుతో గిరిజన, అటవీ భూములు ఆదానీకి కట్టబెడుతున్నారన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, గిరిజన హక్కులు, కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని, యువతకు ఉద్యోగ, ఉపాధి మృగ్యమై, నిరుద్యోగిత రోజురోజుకూ పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించడంతోపాటు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.భాగ్యలక్ష్మి, అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు తదితరులు మాట్లాడారు. సిఐటియు పాడేరు మండల కార్యదర్శి ఎల్ సుందరరావు సభకు ఆహ్వానించగా, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాలదేవ్, బీమారాజు, పోతురాజు,, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మంగమ్మ., కశవ, నాగమ్మ, పాల్గొన్నారు

కార్మికుల ఐక్యతను చాటిన సిఐటియు మహా ప్రదర్శన

పాడేరు పట్టణ వీధుల్లో సిఐటియు ఆధ్వర్యాన కార్మికుల భారీ ర్యాలీ

పాడేరు: అల్లూరి జిల్లా సిఐటియు ప్రథమ మహాసభలలో భాగంగా మంగళవారం పాడేరు పట్టణంలో కార్మికుల మహాప్రదర్శన జరిపారు. వణికించే చలిని తరిమికొడుతూ పాడేరు మన్యం నలుమూలల నుంచి కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎర్రజెండాలను చేతబూని, థింసా నృత్యాలతో, గొంతెత్తి నినాదాలు చేస్తూ, సంఘటిత శక్తిని మరోసారి రుజువుచేస్తూ మహా ప్రదర్శనలో దండులా ముందుకు సాగారు. పట్టణంలోని తలారిసింగి జంక్షన్ నుంచి ఐటిడిఎ, ఆర్‌టిసికాంప్లెక్స్ మీదుగా పాడేరు పట్టణ మెయిన్ రోడ్డు నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు కార్మికులు మహా ప్రదర్శన నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్లు, సామాజిక ఆరోగ్య కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశా వర్కర్లు, హాస్టల్ కార్మికులు డైలీ వేస్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఇతర రంగాల స్కీం వర్కర్లు ప్రదర్శనలో పాల్గొన్నారు 'కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్ని రెగ్యులర్ చేయాలి, స్కీం వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలి, ఉద్యోగ భద్రత కల్పించాలి, సిఐటియు జిందాబాద్'ల అంటూ నినాదాలు చేశారు ప్రదర్శన అనంతరం మోదకొండమ్మ ఆలయం వద్ద ఆడిటోరియంలో నిర్వహించిన సిఐటియు బహిరంగ సభ ప్రాంగణానికి కార్మికులు చేరుకున్నారు.

ఈ కార్మిక ప్రదర్శనలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బేబీరాణి, ఆదివాసి రాష్ట్రీయ అధికార మంచ్ జాతీయ సభ్యులు పి అప్పలనర్స, అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు, సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోనంగి చిన్నయ్యపడాల్, వి.ఉమామహేశ్వరరావు అనకాపల్లి సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్ శంకరరావు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఆశా, సిహెచ్‌డబ్ల్యుల రాష్ట్ర నేత మంగమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసమ్మ, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందరరావు, గిరిజన ప్రాంత వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శెట్టి నాగరాజు, కార్యదర్శి కంబిడి లక్ష్మణరావు పాల్గొన్నారు

సిఐటియు మహాసభల నేపథ్యంలో ఎరుపెక్కిన పాడేరు పట్టణం

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

- మీడియా సమావేశంలో బేబీ రాణి

పాడేరు: రాష్ట్రంలోని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని ఎన్నికల ముందు పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బేబీ రాణి డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా సిఐటియు ప్రథమ మహాసభలకు హాజరైన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సమస్యల్ని విస్మరించి, కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెట్టె పనిలో ఉన్నాయని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులోని రూ.1200 కోట్లను ప్రభుత్వం తన ఖాతాలో పెట్టుకొని, వారికి సంక్షేమ పథకాలకు దూరం చేయడం దారుణమన్నారు. ఆటో, ట్రాన్స్‌పోర్టు, ముఠా కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు రవాణా రంగంలో తీసుకొస్తున్న సవరణ చట్టాన్ని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.

మావోయిస్టు మృతదేహం, పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

మావోయిస్టు మృతి

ప్రజాశక్తి-చింతూరు

ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రంలోని జాపూర్ జిల్లా మిర్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్నార్, పోరోవాడ అడవుల్లో మంగళవారం మధ్యాహ్నం ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మతి చెందాడు. మృతి చెందిన మావోయిస్టు బైరంగడ్ ఏరియా కమిటీ సభ్యుడు రాజుగా పోలీసులు గుర్తించారు. బైరంగడ్ ఏరియా కమిటీలో మావోయిస్టుల ఉనికిపై డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్ పోలీసు బలగాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించారు. కాల్పుల అనంతరం ఘటనా స్థలంలో ఒక తుపాకీ, వంట పాత్రలు, వైర్లు ఇతర విప్లవ సాహిత్యం పోలీసులు స్వాధీనం పరుచుకున్నారు.

కారు పైనుండి బోల్తా పడిన బస్సు

కారుపైకి దూసుకెళ్లి బోల్తా పడిన టూరిస్టు బస్సు

- తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ఓ టూరిస్టు బస్సు ఆగివున్న కారుపైకి దూసుకెళ్లి బోల్తా పడిన సంఘటన మండలంలోని జలతరంగిణి జలపాతం మలుపు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు కథనం ప్రకారం... కాకినాడ జిల్లా పెద్దాపురం గ్రామం నుంచి 25 మంది పర్యాటకులు టూరిస్టు బస్సులో మారేడుమిల్లికి విహార యాత్రకు వచ్చారు. ఇందులో భాగంగా జలపాతాన్ని తిలకించడానికి వస్తుండగా జలతరంగిణి జలపాతం వద్ద మలుపులో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి, అదుపుతప్పి అక్కడే రోడ్డు పక్కన ఆగివున్న కారుపైకి బస్సు దూసుకెళ్లి బోల్తా పడింది. ఆ సమయంలో ఈ ప్రమాదాన్ని గమనించిన అటువైపుగా వెళ్తున్న వాహనదారులు హుటాహుటిన బస్సులో ఉన్న పర్యాటకులను బయటకు తీశారు. బస్సులో ఉన్న ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఆ సమయంలో కారులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై స్థానిక ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

గంజాయి తరలిస్తున్న యువకుల అరెస్టు

ప్రజాశక్తి -సీలేరు

పర్యాటకం ముసుగులో సీలేరు మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నలుగురు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్ఐ రామకృష్ణ మంగళవారం వెల్లడించారు. ఎస్ఐ కథనం ప్రకారం... శని ఆదివారాల్లో పర్యాటకం పేరుతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే యువకులు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు స్థానిక ఏపీ జెన్కో చెక్ పోస్ట్ వద్ద సోమవారం పోలీసులు మాటు వేసి వాహన తనిఖీలు చేశారు. ఈ మార్గంలో వస్తున్న టిఎస్‌ఎఫ్‌డబ్ల్యు 6042 నెంబర్ గల మారుతి సుజుకి బెలూన్ కారును చెక్ పోస్టు వద్ద ఆపి తనిఖీ చేశారు. దీంతో అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించి, కారులో ఉన్న నలుగురు యువకులను అదుపులో తీసుకొని విచారించారు. వారి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఒకరు బీటెక్ విద్యార్థిగా గుర్తించారు. వారి నుంచి 4 కేజీల గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కారు సీజ్ చేశారు. నిందితులను కోర్టుకు తరలించారు. అరెస్టు అయిన వారిలో ఒకరు జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ చల్లని శిల్ప గ్రామానికి చెందిన బి.కున్ను కాగా, మిగిలిన యువకుల్లో తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన గండికోట లక్ష్మి సాయి, గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన చెట్టుపు చంద్రశేఖర్ రెడ్డి, పల్నాడు జిల్లా నరసరావుపేట నిమ్మతోటకి చెందిన షేక్ అహ్మదు ఉన్నారు. గంజాయి అక్రమ రవాణాపై నిరంతరం నిఘా పెట్టామని, పట్టుపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని చట్టి జాతీయ రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చింతూరు సిఐ అప్పలనాయుడు ఆధ్వర్యాన మంగళవారం చేపట్టారు. ఇందులో భాగంగా వాహన డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదని హితవుపలికారు. జాతీయ రహదారి పొడవున ఉన్న ప్రమాదపు మలుపులు వద్ద మితిమీరిన వేగంతో వెళ్లరాదని సూచించారు.

తనిఖీలు చేస్తున్న పోలీసులు

గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పనే లక్ష్యం

పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

రైతులతో మాట్లాడుతున్న పిఒ గోపాలకృష్ణ

ప్రజాశక్తి- పెదబయలు : గిరిజన ఉత్పత్తులను గిట్టు బాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం అరడకోట పంచాయతీలో కాఫీ సాగు క్షేత్రాల్లో పర్యటించారు. కాఫీ రైతులతో సమావేశమై కాపీ మార్కెటింగ్, పల్పింగ్ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు కాఫీ పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. చింతపల్లి మాక్స్ సంస్థ ద్వారా కాఫీకి గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కలిగి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏజెన్సీ వ్యాప్తంగా 67వేల మంది రైతులకు ఒక లక్ష ఎనిమిది వేల ఎకరాల అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేశామన్నారు. మండల పరిషత్ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. మెనూ పాటిస్తూ, రుచి, శుచితో నాణ్యమైన భోజనం పెట్టేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.అంగన్వాడీ కేంద్రంతో తాగునీటి సౌకర్యం కల్పనకు తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజినీర్‌ను ఆదేశించారు, అరడకోట ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను సందర్శించి, 247మంది విద్యార్థులకుగాను 201మంది ఉండడం, మిగిలిన వారంతా దీర్ఘకాలంగా బడికి దూరంగా ఉండడంపై ప్రశ్నించి, వారిని వెంటనే బడికి వచ్చేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల మొబైల్ నెంబర్లను సేకరించి, గోడపై అంటించాలన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి ఎన్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డిఎంహెచ్‌ఒ డాక్టర్ జమాల్ బాషా

ప్రజాశక్తి -హుకుంపేట : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిఎంహెచ్‌ఒ డాక్టర్ జమాల్‌భాషా హెచ్చరించారు.



వైద్యసేవలపై ఆరా తీస్తున్న డిఎంహెచ్‌ఒ

మంగళవారం ఉప్ప పిహెచ్‌సి ఓల్డాలో ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యశిబిరాన్ని పరిశీలించారు. 104 వాహనం ద్వార రోగులకు అందిస్తున్న సేవలను, హెల్త్ చెకప్‌లను పరిశీలించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా నిర్ధేశించిన గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. మాతా శిశుమరణాల అడ్డుకట్టకు ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఉప్ప పిహెచ్‌సిని సందర్శించి, వైద్యసేవలు అమలుపై ఆరా తీశారు. రికార్డుల గది,ల్యాబ్, ఫార్మశీ గదులను పరిశీలించారు. ఎఆర్‌వి, ఎఎస్‌వి, ఇతర వ్యాక్సిన్ల నిల్వపై వైద్యాధికారిని ప్రశ్నించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాడేరు అదనపు జిల్లా వైద్యాఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె లీలాప్రసాద్, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్, టీబీ సూపర్‌వైజర్ కిరణ్ పాల్గొన్నారు.

వెదురు కార్మికులకు కూలి డబ్బులు చెల్లించాలి

సిఐటియు, గిరిజన సంఘం జిల్లా నాయకులు వెంకట్, సురేష్

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్, చిత్రంలో సురేష్ తదితరులు

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని తులసిపాక, సిరసనపల్లి కొండ ప్రాంతాల్లో ఫారెస్ట్ అధికారులు స్థానిక ఆదివాసీల చేత వెదురు సేకరించుకొని నేటికీ కూలి డబ్బులు చెల్లించలేదని, తక్షణమే ఇవ్వాలని సిఐటియు రంపచోడవరం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. వెదురును డిపోలకు తరలించి టెండర్ల ద్వారా డబ్బును తమ ఖాతాలో జమ చేసుకున్న అధికారులు నేటికీ గిరిజనులకు కూలి డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. మంగళవారం వారు తులసిపాక గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సాదుల సోమిరెడ్డి, వంజ ముత్తయ్య, ఇరకం బుజ్జి, మడకం భద్రయ్య తదితరులు మాట్లాడుతూ గతేడాది నవంబర్, డిసెంబర్ మాసాలలో ఫారెస్ట్ అధికారి డిఆర్‌ఒ రాజు, వెదురు సేకరణ చేయాలని, ఒప్పందం ప్రకారం వేతనం చెల్లిస్తానని చెప్పడంతో కొండపైనున్న వెదురును నరికి కిందకు తీసుకొచ్చి డిపోలకు తరలించామని తెలిపారు. నేటికీ కూలి డబ్బులుగాని, కొండపైకి వాహనం వెళ్లడానికి బాట వేసినందుకుగాని డబ్బులు ఇవ్వలేదని వాపోయారు. ఈ విషయాన్ని అనేక మార్లు ఫారెస్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఈ సందర్భంగా సిఐటియు, గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ గతేడాది కూలి డబ్బులు చెల్లించకుంటే ఈ ఏడాది వెదురు సేకరణను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మడకం చిన్నయ్య, వంజ ముత్తయ్య, ఇరకం బుజ్జి, ఇరకం సుబ్బయ్య, సాదుల రామిరెడ్డి, ఎరకం ముత్తయ్య, కలముల వెంకయ్య, మడకం భద్రయ్య, తులసిపాక, సిరసనపల్లి వెదురు కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలపై 22న ఎజి.కోడేరు సచివాలయం ముట్టడి

గిరిజన సంఘం మండల కార్యదర్శి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - చింతూరు

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ఎజి.కోడేరు గ్రామ సచివాలయాన్ని ఈ నెల 22న ముట్టడిస్తామని గిరిజన సంఘం మండల కార్యదర్శి కారం నాగేశరరావు తెలిపారు. ఎజి.కోడేరు పంచాయతీ పరిధి ఉలుమూరు, మల్లెతోట గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి ఆయా గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని గ్రామాలు ఇప్పటి వరకు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. వీధిలైట్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, వరదలకు ఇళ్లు దెబ్బతిన్న, కూలిపోయిన బాధితులకు రూ.10వేలు నష్టపరిహారం ఇవ్వాలని, ఆర్‌బికెల ద్వారా సరఫరా చేసిన విత్తనాలు పంట దిగుబడి రాక నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, సీసీ రోడ్లు నిర్మాణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పై సమస్యలపై పంచాయతీలోని మూడు గ్రామాల ప్రజలతో ఈ ముట్టడి నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు దర్ముల మల్లయ్య, స్థానికులు నాగరాజు, రమేష్, కుమారి, ప్రసాద్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న గిరిజన సంఘం మండల కార్యదర్శి నాగేశ్వరరావు

వాస్తు సిద్ధాంతి వెంకటేశ్వర్లు మృతి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల కేంద్రం రేఖపల్లికి చెందిన ప్రముఖ అంతర రాష్ట్ర వాస్తు సిద్ధాంతి, రేఖపల్లి మాజీ ఎంపిటిసి సభ్యులు వీర్ల వెంకటేశ్వర్లు (70) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. వెంకటేశ్వర్లు వాస్తు సిద్ధాంతిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, చత్తీస్‌ఘడ్, ఒడిశా, మధ్యప్రదేశ్ ఐదు రాష్ట్రాల్లో సుపరచితులు. వెంకటేశ్వర్లు పక్షవాతానికి గురై కొన్నాళ్ళుగా ఇంటి వద్దనే చికిత్స పొందారు. ఆయన భార్య పున్నమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. వెంకటేశ్వర్లుకు కుమార్తెలు సుశీల, చిన్నారి, దుర్గా, కుమారుడు కొండబాబు ఉన్నారు. వెంకటేశ్వర్లు అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు.

వెంకటేశ్వర్లు (ఫైల్‌ఫొటో)

22న జోనల్ స్థాయి గిరి విజ్ఞాన సంబరాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఈనెల 22న జోనల్ స్థాయి గిరి విజ్ఞాన సంబరాలు నిర్వహించాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. జోనల్ స్థాయి గిరి విజ్ఞాన సంబరాలు పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాలకు చెందిన విద్యార్థులు పాడేరు తలారిసింగి ఆశ్రమ పాఠశాలలోను, పెదబయలు, ముంచింగిపుట్టు మండలాల విద్యార్థులు పెదబయలు బాలుర -1 ఆశ్రమ పాఠశాలలోను, డుంబ్రిగుడ, అనంతగిరి, అరకువ్యాలీ మండలాల విద్యార్థులు అరకు వ్యాలీ రవ్వలగుడ ఆశ్రమ పాఠశాలలోను, చింతపల్లి, జి.కె. వీధి, కొయ్యూరు మండలాల విద్యార్థులు చింతపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల -1 లోను నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. ఈనెల 28, 29, 30 తేదీలలో ఐటిడిఎ స్థాయి గిరిజన విజ్ఞాన సంబరాలను స్థానిక తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో నిర్వహిస్తారని వెల్లడించారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్/హుకుంపేట: మానవాళికి వెలుగు నింపేందుకు ఏసు పుట్టారని డిఆర్‌ఓ బి.దయానిధి అన్నారు. మంగళవారం హుకుంపేట మండలం భీమవరంలో విశాఖపట్నం క్రైస్ట్ మిషన్ ఫౌండర్ ఎంజిల్ మోహనరావు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిపించారు. యునైటెడ్ ఫౌండర్ చీఫ్ రివైవల్ జాన్ వెస్లీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు, స్కిట్లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్‌సలహాదారు బి.ఎలీషారావు, కె.సత్యారావు, ప్రధాన కార్యదర్శి ఎం.స్టీవెన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొట్ట కూటి కోసం చిన్నారి సాహసం

ప్రజాశక్తి- జి.మాడుగుల : కూటి కోసం కోటి విద్యలు అన్న నానుడికి తగ్గట్టుగా మండల కేంద్రంలో మంగళవారం రోడ్డుపైన ఐదేళ్ల చిన్నారి సర్కస్ చేస్తున్న దృశ్యాలు పలువురిని అబ్బురపరిచాయి. రోడ్డుపైన గాలిలో తాడుపై విన్యాసాలు చేసింది. ప్రజలిచ్చే డబ్బులను తీసుకుని వెళ్లిపోయింది. వీధుల్లో సర్కస్ చేయడమే వృత్తిగా పెట్టుకున్న సంచార జాతులకు చెందిన చిన్నారి చేసిన సాహసాలకు మెచ్చి, స్థానికులు తలోకొంత ఆర్థికసాయం చేశారు.

లక్కలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని గుంటగన్నెలపిహెచ్‌సి పరిధిలోని లక్క గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారిణి టి ప్రేమ ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొని రోగులకు సేవలు అందించారు ప్రస్తుత సీజన్‌లో వ్యాప్తి చెందే వ్యాధులపై అవగాహన కలిపిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ రత్నం, ఎఎన్ఎం ఎ భానుమతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఫార్మా బస్సుకు విద్యార్థి బలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లోని డిపాల్ స్కూల్లో చదువుతున్న ఏడేళ్ల బాలుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం ఉదయం తల్లితో పాటు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో ఇందిరా పార్క్ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా ఫార్మా బస్సు ఢీకొంది. ఈ ఘటనలో విలజ (9) తలపై నుంచి ఫార్మా కంపెనీకి చెందిన బస్సు చక్రాలు వెళ్లడంతో తల నుజ్జయి అక్కడికక్కడే బాలుడు మృతి చెందాడు. బాలుడి తాత చిట్టిబాబు స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగంలో పనిచేసి విరమణ పొందారు. బాలుడి తండ్రి ఆటోరిక్షాలో ఉంటున్నారు. అగనంపూడి అభిరామి అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ప్రతిరోజు పాఠశాలకు ద్విచక్ర వాహనంపై తల్లి తీసుకువెళ్లి వస్తుంటారు. ఉక్కునగరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు వివరాలను నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బాలుని మృతదేహంతో ధర్నా

ఫార్మా కంపెనీ బస్సులను ఈ రహదారిలో నిషేధించాలని గత కొంతకాలంగా పాఠశాల యాజమాన్యాలకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు రాస్తారోకో చేపట్టారు. బాలుని మృతదేహంతో పిల్లల తల్లిదండ్రులు, ఉక్కు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. కేవలం టోల్‌ఫ్లాజ్ ఎగ్గొట్టడానికి ఫార్మా బస్సులను ఉక్కునగరం వైపు మళ్లిస్తున్నారని ఆరోపించారు.

విద్యార్థి మృతి చెందిన సందర్భంగా పాఠశాలకు యాజమాన్యం సెలవు ప్రకటించింది. ఉదయం 7 గంటల నుంచి 9:00 వరకు విపరీతమైన రద్దీ ఉండే ఈ ప్రాంతంలో కనీసం ఒక్క ట్రాఫిక్ పోలీసును కూడా ఏర్పాటు చేయకపోవడంపై ఉక్కు ఉద్యోగులు విమర్శలు చేస్తున్నారు. అటు యాజమాన్యం కానీ ఇటు ట్రాఫిక్ పోలీసులు కానీ పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గిరిజన విద్యార్థుల మరణాలకు పిఒదే బాధ్యత

రెండో రోజూ కొనసాగిన నిరాహార దీక్షలు

దీక్షల్లో కూర్చున్న నాయకులు

ప్రజాశక్తి పాడేరు: గిరిజన ప్రాంతంలో విద్యార్థుల వరస మరణాలకు పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ బాధ్యత వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.ప్రభుదాస్ డిమాండ్ చేశారు గిరిజన విద్యార్థి మహిళా, కార్మిక గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఐటిడిఎ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండవ రోజు మంగళవారం కొనసాగాయి. దీక్షలో పాల్గొన్న ప్రభుదాస్ మాట్లాడుతూ గిరిజన ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తూ, గిరిజనులను, గిరిజన ప్రజా ప్రతినిధులను హేళన చేస్తున్న పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణను ప్రభుత్వం వెంటనే సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి, ప్రజా సంఘాలు, మీడియా ప్రతినిధులను ఎవరినీ గిరిజన విద్యాసంస్థల్లో ప్రవేశాన్ని నిరాకరిస్తూ గిరిజన సంక్షేమ ముఖ్యకార్యదర్శి జారీ చేసిన సర్కులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ఇంటర్, డిగ్రీ గిరిజన విద్యార్థుల ట్యూషన్, ఎగ్జామినేషన్, అడ్మిషన్ ఫీజులను ఐటిడిఎ తక్షణమే చెల్లించాలని, జిఒ3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి కూడా రాధాకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్న, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మువ్వల లక్ష్మణరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి జీవన్‌కృష్ణ, మహిళా సంఘం నాయకురాలు లతా కుమారి, బి నరేష్, ఎం సురేష్ పాల్గొన్నారు.

ఇవీ డిమాండ్స్

- గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించాలి.
- గిరిజన ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తూ, గిరిజన ప్రజాప్రతినిధులను హేళన చేస్తున్న పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణను ప్రభుత్వానికి సరెండర్ చేయాలి.
- విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థి, ప్రజా సంఘాలు, మీడియా ప్రతినిధులను గిరిజన విద్యాసంస్థల్లో ప్రవేశాన్ని నిరాకరిస్తూ గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన సర్కులరు రద్దు చేయాలి.
- గిరిజన ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలి. పెదబయలు తహశీల్దార్ మరిపై సమగ్ర విచారణకు ప్రభుత్వం తక్షణమే ఆదేశించాలి.
- జిఒ3కు చట్టబద్ధత కల్పించాలి.
- ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలి.
- బోయ,వాల్మీకి, బెంత ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన, ఏకసభ్య కమిషన్‌ను ఉపసంహరించుకోవాలి. జిఒ52 రద్దు చేయాలి.
- ఇంటర్, డిగ్రీ గిరిజన విద్యార్థులకు ట్యూషన్, ఎగ్జామినేషన్, అడ్మిషన్ ఫీజులను తక్షణమే ఐటిడిఎ చెల్లించాలి.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పిఒ

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : పిఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు స్థానిక అధికారులు చర్యలు చేపట్టాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఐటిడిఎ కార్యాలయం నుంచి జిల్లా, డివిజన్‌స్థాయి అధికారులు, ఎంపిడిఒలు, గహ నిర్మాణ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తపల్లి జలపాతం, వంజంగి, తాజంగి, లంబసింగి, పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యంపై ఎంపిడిఒలు దష్టి సారించాలన్నారు. ఉపాధి నిధులతో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలను పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి దుకాణం దగ్గర తడి, పొడి చెత్తకు వేర్వేరుగా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసేలా వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో సర్పంచుల సహకారం తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంపు, మెనూ సక్రమంగా అమలు జరిగేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో వైద్య సిబ్బంది హెల్త్ క్యాంపులు నిర్వహించి విద్యార్థులకు వైద్య సేవలు అందించాలన్నారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో పిఆర్ ఇఇలు కె.లావణ్య కుమార్, కొండయ్య పడాల్, డిపిఒ కొండలరావు, డిఎల్‌పిఒ పిఎస్ కుమార్, 11 మండలాల ఎంపిడిఒలు పాల్గొన్నారు.

రైతుల అంగీకారంతోనే సమగ్ర భూ రీసర్వే

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించి, వారి అంగీకారంతోనే సమగ్ర భూరీసర్వే నిర్వహించాలని సబ్‌కలెక్టర్ అభిషేక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సచివాలయ సర్వేయర్లు, విఆర్ఒలు, ప్రత్యేక సర్వేయర్ల బందాలతో రీసర్వేపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, భూరీసర్వే జరిపే ముందు గ్రామ ప్రజలతో రెండు రోజుల ముందే సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించి, ప్రజలు అంగీకారంతోనే రీ సర్వే చేపట్టాలన్నారు. .పూర్వం ప్రభుత్వం చేపట్టిన సర్వే ఆధారాలైన సెటిల్మెంట్ పట్టా, పట్టాదార్ పాస్‌పుస్తకాలు, 1బి, అడంగల్, తదితర ప్రభుత్వం జారీ చేసిన రెవెన్యూ రికార్డుల ఆధారాలతో రీసర్వేకు వెళ్లాలని ఆదేశించారు. అన్నదమ్ములు, తాతలు, తండ్రుల వాటా భూములపై ఎటువంటి తగాదాలు ఉన్నా, కోర్టులో కేసులు నమోదుతో కూడిన భూములను రీసర్వే తాత్కాలికంగా నిలిపివేయాలని, విషయాన్ని తహశీల్దార్‌కు తెలియపరచాలని ఆదేశించారు.

రీ సర్వే నిర్వహించేటప్పుడు భూపట్టాదారుల అనుమతితోపాటు, పక్క భూమి యజమానుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని, ప్రతి సచివాలయ పరిధిలో సర్వేయర్ ఒక రోజుకు 25 ఎకరాల రీసర్వే చేపట్టాలని అన్నారు. రీ సర్వే మూడు నెలల నుండి 5 నెలల వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. తహశీల్దార్ నర్సమ్మ, ఆర్ఐలు రవి కుమార్, మోహనరావు , సీనియర్ అసిస్టెంట్ భూపతి, పాల్గొన్నారు.

జెసికి విన్నవిస్తున్న గిరిజన సంఘం నేతలు

రీసర్వేలో అమాయకులకు అన్యాయం

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: సమగ్ర భూరీసర్వే నిర్వహిస్తున్న విఆర్ఒలు, సర్వేయర్ల బృందం ప్రలోభాలకు తలొగ్గి అక్రమాలకు పాల్పడుతూ అమాయక రైతులకు అన్యాయం చేస్తున్నారని, దీనిపై వారికి స్పష్టమైన ఆదేశాలివ్వాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం.శ్రీను కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌ను వినతిపత్రం అందించారు. మండలంలోని పలు పంచాయతీల్లో రీసర్వేలో చోటుచేసుకున్న అవకతవకలకు సంబంధించి పత్రికల్లో వచ్చిన కథనాలను జెసికి చూపించారు. భూసర్వేలో అక్రమాల ద్వారా సమస్యలను పరిష్కరించాల్సి పోయి, ఇరుగుపొరుగు రైతుల మధ్య వివాదాలను సృష్టించేలా వ్యవహరించడం సరికాదన్నారు.రైతుల అంగీకారంతోనే ఆమోదయోగ్యంగా రీసర్వే నిర్వహించాలని, ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా విఆర్ఒలు, సర్వేయర్లు బృందం వ్యహరిస్తున్న తీరుపై ఇదివరకే తహశీల్దార్ దృష్టికి తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు కొర్ర డొంబ్రు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చెండా ఎలియా

హైడ్రో పవర్ ప్రాజెక్టులతో గిరిజనులకు నష్టం

ప్రజాశక్తి - హుకుంపేట: గిరిజనులకు నష్టం చేకూర్చే హైడ్రో పవర్ ప్రాజెక్టులను నిలుపుదల చేయాలని దండకారుణ్య విమోచన సమితి అధినేత చెండా ఎలియా డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ, ఐదో షెడ్యూల్‌లో గిరిజనులకు జీవనాధారంగా ఉన్న కొండలు, అడవులు, జనావాసాలను నాశనం చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు.

5వ షెడ్యూల్ ప్రాంతాన్ని కూడా వదిలిపెట్టకుండా ప్రాజెక్టులకు అనుమతులిస్తున్న మోడీ ప్రభుత్వానికి, రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం మడుగులొత్తుతూ షిరిడీసాయి కనస్ట్రక్షన్స్ కంపెనీ విశ్వేశ్వరరెడ్డికి చింతపల్లి మండలం గొందిపాకలు, సమగిరి, యర్రవరంలలో 1500 మెగావాట్ల హైడ్రో పవర్ ప్లాంట్ ఏర్పాటుకు మూడు వేల ఎకరాల భూమిని కట్టబెట్టడంపై దుయ్యబట్టారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి.భాగ్యలక్ష్మి, ఇతర గిరిజన ప్రజాప్రతినిధులు దీన్ని ప్రతిఘటించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో సమితి రాష్ట్ర నాయకుడు పెనుమల రంజిత్‌కుమార్ ఉన్నారు.

మాట్లాడుతున్న అనిత

బంగారమ్మపాలెం వద్ద జెట్టీ నిర్మించాలి

- మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎన్ఎఒబి నిర్వాసితుల కోసం బంగారమ్మపాలెంలో తక్షణం జెట్టీ నిర్మించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిమాండ్లను నెరవేర్చుకునేందుకు ఎన్ఎఒబి నిర్వాసితులు 50 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు స్పందించకపోవడం శోచనీయమని తెలిపారు. జెట్టీ నిర్మాణం జరిగే వరకూ మత్స్యకారులను సముద్రంలోకి వేటకు అనుమతించాలన్నారు. సముద్రపు ఒడ్డు నుంచి హార్బర్ నిర్మించాలన్నారు. హార్బర్ సమీపంలోనే మత్స్యకారులకు పునరావాస కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. హార్బర్ నిర్మాణం జరిగే వరకూ శారద, వరాహ నదులలో చేపల వేటకు ఆటంకం పరచరాదన్నారు. శారదా ముఖద్వారం గుండా సముద్రంలోకి మత్స్యకారులు వెళ్లి చేపలవేట చేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. నేవీలో 50 శాతం ఉద్యోగాలను నిర్వాసితులైన మత్స్యకార కుటుంబాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బంగారమ్మ పాలెం మత్స్యకార సొసైటీకి చెందిన 116 ఎకరాల భూమికి ప్రస్తుతం ఉన్న రేటు ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్రీయ విద్యాలయాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి బంగారమ్మపాలెం గ్రామ అధ్యక్షులు కారే కష్ణ, కార్యదర్శి కోడె బంగార్రాజు, బొంది బంగార్రాజు, మైలపల్లి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడు ఎన్నికలు పెడితే వైసిపికి 50 సీట్లు కూడా రావు

రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే అధికార వైసిపికి 50 సీట్లు కూడా రావని అనిత అన్నారు. మీడియా సమావేశం సందర్భంగా ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు ఆమె బదులిస్తూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని తెలిపారు. జగన్ పాలన పట్ల అన్ని తరగతుల ప్రజలూ తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు.

ఘనంగా ద్రోణంరాజు సత్యనారాయణ జయంతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కీర్తిశేషులు ద్రోణంరాజు సత్యనారాయణ 90వ జయంతి వేడుకలు సిరిపురంలోని ద్రోణంరాజు సర్కిల్ వద్ద ఘనంగా జరిగాయి. వైసిపి నేత ద్రోణంరాజు శ్రీవత్సవ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ ద్రోణంరాజు సత్యనారాయణతో తమకున్న అనుభవాలను నెమరువేసుకున్నారు. ద్రోణంరాజు కుటుంబం యూనివర్సిటీ వంటిదని, ఎంతోమందిని రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదని అన్నారు. నేడు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, నాయకులుగా చెలామణీ అవుతున్న ఎంతోమంది ఆయన శిష్యులేనన్నారు. కరోనా కారణంగా అకాల మరణం చెందిన ఆయన కుమారుడు ద్రోణంరాజు శ్రీనివాస్ నిబద్ధత కలిగిన నేతగా గుర్తింపు పొందారన్నారు. నేడు శ్రీవత్సవ అటువంటి లక్షణాలే కలిగి ఉన్నాడని కొనియాడారు. ద్రోణంరాజు కుటుంబానికి తామంతా తోడుగా ఉంటామన్నారు. ద్రోణంరాజు శ్రీవత్సవ మాట్లాడుతూ తన తాత సత్యనారాయణ దేశ రాజకీయాలను శాసించే వారని, ముఖ్యంగా ఉత్తరాంధ్ర టైగర్‌గా పేరు తెచ్చుకున్నారని, తన తండ్రి ద్రోణంరాజు శ్రీనివాస్ రాజకీయ రంగంలో మచ్చలేని నేతగా గుర్తింపు పొందారని, వారి అడుగుజాడల్లో నడుస్తానని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమ కుటుంబం మీద ఎంతో ప్రేమ, అభిమానం చూపిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాస్, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్ రాజు, వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు, జియ్యాని శ్రీధర్, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ప్రసన్నకుమార్, కెవి.రామ్మూర్తి, తైనాల విజయ్ కుమార్, సీతంరాజు సుధాకర్, కోలా గురువులు, తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోగుల అవసరాలను తీర్చే కెజిహెచ్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని, ఆ దిశగా ప్రణాళికలు తయారు చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వైద్యాధికారులను ఆదేశించారు. కెజిహెచ్, ఆంధ్ర మెడికల్ కాలేజీకి సంబంధించి మౌలిక సమస్యలపై మంగళవారం ఉదయం కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ప్రధాన వైద్యులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెజిహెచ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతగానో డబ్బు ఖర్చు చేస్తున్నప్పటికీ అనేక రూపాలలో లోపాలు కనిపిస్తున్నాయని, అందుకోసం గత సమావేశంలో ప్రతి విభాగాధిపతికీ వారి విభాగంలో చిన్న పనుల కోసం లక్ష రూపాయలు మంజూరు చేశామని తెలిపారు. దీనికి సంబంధించి ఏ విభాగాధిపతి ఎంత ఖర్చు చేశారు ? అన్న వివరాలపై సమీక్ష చేశారు. చాలా విభాగాధిపతులు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ఉన్నారని అసహనం వ్యక్తం చేశారు. ప్రతి విభాగాధిపతీ తమ వార్డుల పరిశుభ్రత, మంచినీరు, లైట్లు, ఫ్యానులు, బెడ్స్, టాయిలెట్స్ వంటి పనులకు ఈ డబ్బు వినియోగించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని అన్నారు. ఇకనైనా ప్రతి విభాగాధిపతీ ఈ డబ్బును సక్రమంగా వినియోగించి సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. డబ్బులు సరిపోకపోతే ఇంకా మంజూరు చేస్తామని తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన సామగ్రి కొనుగోలుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న నిధులను సమృద్ధిగా వినియోగించాలని, ఇతర నిధుల సమీకరణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను సమకూర్చేందుకు సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో అన్ని విభాగాల అధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్యలు చేపట్టాలన్నారు. ఏయే విభాగంలో ఏయే సామగ్రి అవసరమో నివేదికలు తయారు చేసి నిర్ణీత గడువులోగా ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. పత్రికలలో ఆసుపత్రికి సంబంధించి ఎటువంటి ప్రతికూల వార్తలు ప్రచురితమైనా వెనువెంటనే పరిష్కరించాలని సూచించారు.

మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

పలుచోట్ల మొక్కల నాటివేత

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం, సీలేరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో జగనన్న పచ్చ తోరణం కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఇందులో భాగంగా సీలేరు అటవీశాఖ రేంజ్ అధికారి కే. శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో స్థానిక ఎస్ఐ రామకృష్ణ, ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, ఏపీ జెన్కో ఈఈ జాకీర్ హుస్సేన్, ఏడిఈ క్యాంపు అప్పలనాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవమణి, వార్డెన్ తదితరులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ డిఆర్ఓ సిహెచ్.సింహాచలం పడాల్, దారకొండ సెక్షన్ బీట్ ఆఫీసర్లు సతీష్, చంద్రశేఖర్, వివేకానందరావు, సీలేరు రేంజి కార్యాలయ టెక్నికల్ అసిస్టెంట్ సత్తిబాబు, ఉప సర్పంచ్ వల్లి ప్రసాద్, వైసిపి నాయకులు కృష్ణమూర్తి, బుజ్జి, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కొత్తూరు పంచాయతీ శివలింగపురం ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో స్థానిక సర్పంచ్ సారా. సీతయ్య ఆధ్వర్యంలో ఎంపిపి శెట్టి .నీలవేణి మొక్కలు నాటారు. మండలంలోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతగా తీసుకుని, మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఎంపిపి నీలవేణి కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి పోతుబోయిన సన్యాసిరావు, వైసిపి సీనియర్ నాయకుడు శెట్టి గంగాధర్ స్వామి, ఉప సర్పంచ్. నరేంద్ర, పాఠశాల హెచ్ఎం శెట్టి సుబ్బారావు, వార్డెన్ సింహాద్రి ఫారెస్ట్ శాఖ అధికారులు ఎన్. సీతారాం, దుర్గాప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలోని సీతగుంట బాలుర వసతి హాస్టల్ ఆవరణలో హెచ్ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా అటవీ రేంజర్ చంద్రశేఖర్ పాల్గొని 50 మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ పి మాధవరావు, అటవీ బీట్ ఆఫీసర్ సిహెచ్ నారాయణపడాల్, ఎంపిటిసి కె.బొంజుబాబు, జెడ్‌పిటిసి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీలేరులోని ఆశ్రమ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

హుకుంపేట : మండల పరిధిలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి 50వ జన్మదినం సందర్భంగా జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. బుధవారం జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని కేక్ కటింగ్, స్థానిక పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ వంటి కార్యక్రమాలను చేపడతామన్నారు.

కార్యక్రమంలో ఎంపిపి కూడా రాజబాబు, సూకూరు ఎంపిటిసి కిలగాడ సింహాచలం, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు ఎం. విశ్వేశ్వరరావు, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు కొర్రా నాగరాజు, సర్పంచులు ఫోరం అధ్యక్షుడు కాకారి బొంజిబాబు, మాజీ ఎంపిపి బత్తిరి రవిప్రసాద్, కొంతిలి సర్పంచ్ రేగం రమేష్, వైసిపి విద్యార్థి విభాగం జిల్లాకార్యదర్శి నైని సత్తిబాబు, భూషణ్ అటవీశాఖ అధికారులు సతక రామూర్థి, పలాసి ఆమని, హెచ్ఎం జంపరంగి లంబన్న పాల్గొన్నారు

మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - రంపచోడవరం

గిరిజన ప్రాంతాల్లోని రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పనకు తక్షణమే నిధులు కేటాయించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇ.సిరిమల్లిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనేక గ్రామాల్లో శంకుస్థాపన చేసి రహదారులు నిర్మాణం చేపట్టకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పత్రికలు, టీవీల్లో ప్రచారం చేసుకుంటూ గొప్పలు చెప్పుకోవడం తప్పా గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, మౌలిక వసతులు కల్పించే దిశగా, ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు కృషి చేయకపోవడం అత్యంత బాధాకరమన్నారు. గిరిజనులకు ఖర్చు పెట్టాల్సిన ఎస్టి సబ్ ప్లాన్ నిధులు దారి మళ్ళించడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి జగన్ పుట్టిన రోజు వేడుకలు ఆర్భాటంగా 3 రోజులు పాటు జరుపుతూ, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలకు ఖరీదైన వస్తువులు పంచడంపై ఉన్న శ్రద్ధ గిరిజన ప్రాంతంలో రోడ్లు, మంచి నీరు, మౌలిక సదుపాయాలు కల్పించడంపై లేకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని, లేకుంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

భారత నౌకాదళంలోకి 'వగిర్'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రాజెక్ట్ - 75 ఐదో జలాంతర్గామి కల్వరి క్లాస్ సబ్‌మెరైన్ యార్డ్ 11879 'వగిర్'ను మంగళవారం భారత నావికాదళానికి అందజేశారు. స్కార్పెన్ డిజైన్‌తో కూడిన ఆరు జలాంతర్గాముల స్వదేశీ నిర్మాణంలో భాగంగా జలాంతర్గాములు ముంబయిలో నావల్ గ్రూప్ మజాగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్, ఫ్రాన్స్ సహకారంతో నిర్మితమవుతున్నాయి. వగిర్ నిర్మాణం 2020లో ప్రారంభమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి సీ ట్రయల్స్ నిర్వహించారు. 24 నెలల వ్యవధిలో భారత నౌకాదళానికి అందజేసిన మూడో జలాంతర్గామి ఇదని నౌకాదళాధికారులు తెలిపారు.

బాల ప్రవీణ్‌కు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి జోన్ 2లో డంపింగ్ యార్డ్ వద్ద పందులను కాల్చి చంపే క్రమంలో తూటా గోళీలు తగిలి గాయపడ్డ బాల ప్రవీణ్‌కు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలంటూ మంగళవారం సాయంత్రం ఎడిసి సన్యాసిరావుకు సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, బాధితుని కుటుంబ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే బాధితున్ని మూడు ఆసుపత్రులు మార్చి, కెజిహెచ్‌లో జాయిన్ చేశామని, ఇప్పటికీ శరీరంలో ఉన్న గోళీలు తీయలేకపోయారని తెలిపారు. కార్మికునికి మెరుగైన చికిత్స చేయించే బాధ్యత జివిఎంసిదేనని అన్నారు. బాధితుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎంహెచ్ఒ శాస్త్రి, ఎడిసి వివిఎస్.రావు మెరుగైన వైద్యం అందించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, పి.రాజ్ కుమార్, జి.కిరణ్ ఉన్నారు.

అవినీతికి చిరునామాగా 'స్థాయీ సంఘం'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పలు పనుల అంచనాలు పెంచి, ఇష్టానుసార ఆమోదాలతో కోట్లాది రూపాయలు దోచుకోవడానికి జివిఎంసి స్థాయీ సంఘం సభ్యులు సిద్ధమయ్యారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జివిఎంసి స్థాయీ సంఘం అవినీతి, అక్రమాలకు చిరునామాగా మారిందన్నారు. అనుమతి లేకుండా రెట్టింపు మొత్తానికి కొన్న వైర్‌లెస్ సెట్లు, జగనన్న ఇళ్ల స్థలాల సాఫ్ట్‌వేర్ రూపకల్పన, చెత్త తొలగింపు వాహనాల కొనుగోలు వంటి విషయాల్లో అవినీతి వెల్లడవుతోందన్నారు.

8న డాగ్ షో

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ కెనైన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 8న తలపెట్టిన డాగ్ షో బ్రోచర్‌ను మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నెడ్ క్యాప్ చైర్మన్ కెకె.రాజుతో కలిసి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 8 న ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అన్ని రకాల పెట్, డాగ్‌లతో కూడిన షో ఎంవిపి కాలనీ ఆళ్వార్‌దాస్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మానవ జీవితాలలో కుటుంబ సభ్యులుగా శునకాలు కనిపించడం పరిపాటి అన్నారు. ల్యాబ్రడార్ రిట్రైవర్, గోల్డెన్ రిట్రైవర్, జర్మన్ షెపార్డ్, గ్రేట్ డేన్, డాబర్ మెన్, డాల్మేషన్, సెయింట్ బెర్నార్డ్, బాక్సర్, సైబీరియన్ హస్కీ, ఫ్రెంచ్ బుల్ డాగ్ తదితర వంద రకాల డాగ్స్ ఈ ప్రదర్శనలో పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో డాగ్‌షో నిర్వాహకులు బాబు, పెట్ యజమానులు పాల్గొన్నారు.